సాక్షి మహబూబాబాద్

శనివారం | 9 | ఆగస్టు | 2025



సెల్ఫీ విత్ రాఖీ

బంధాన్ని బలోపేతం చేస్తూ.. అనుబంధాల మాధుర్యాన్ని పెంచేదే రాఖీ. ఈరక్షాబంధన్ రోజున మీ తోబుట్టువులకు రాఖీ కడుతూ సెల్ఫీ తీసి 'సాక్షి'కి పంపించండి. మీఫొటోను మేం ప్రచురిస్తాం. సెల్ఫీతోపాటు పేరు, గ్రామం, జిల్లా, వివరాలు ఈ నంబర్‌కు వాట్సాప్ చేయండి.

సెల్ఫీ పంపాల్సిన వాట్సాప్ నంబర్

98481 94906



వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళా భక్తులు

అమ్మవారికి హారతి ఇస్తున్న మహిళలు



వాయినాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు



వైభవంగా వరలక్ష్మీ వ్రతం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రావణమాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకొని వరలక్ష్మీవ్రతం నిర్వహించారు. ఉదయం వాసవీమాత అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడుతాటిపాముల దుర్గాప్రసాద్ అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలు, పూలమాలలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉత్సవ విగ్రహాన్ని చీరలతో అలంకరించి, లలిత సహస్రనామాలు పాటించగా.. బ్రాహ్మణోత్తములు బ్రహ్మశ్రీ తాటిపాముల నరసింహమూర్తి భక్తులతో వరలక్ష్మీవ్రతం జరిపించారు. పూజల అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో కౌశిక్ శర్మ, మోహన్ రావు, మంజువాణి, రవికుమార్, గీతారాణి, శేషగిరి, ఉషారాణి, రమణ, రాము ఉన్నారు.





పండుగ సందడి

జిల్లా కేంద్రంలో రాఖీ పండుగ సందర్భంగా శుక్రవారం కొనుగోళ్ల సందడి నెలకొంది. మహిళలు దుకాణాల్లో రాఖీలు కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

– సాక్షి, స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్

న్యూస్‌రీల్

ఎస్పీకి రాఖీలు కట్టిన విద్యార్థినులు



మహబూబాబాద్ రూరల్ : మానుకోట పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ గర్ల్స్ సబ్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌కు విద్యార్థినులు శుక్రవారం రాఖీలు కట్టారు. ఎస్ ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మన్సూరు నిక్షిప్త, జిల్లా నాయకురాళ్లు శృతి, జాస్మిన్, నాయకులు జ్యోతిబసు, రాకేశ్, మహేశ్, వినోద్ ఉన్నారు.

చట్టబద్ధతతోనే పిల్లలకు హక్కులు




మహబూబాబాద్: చట్టబద్ధతతోనే పిల్ల లకు హక్కులు వస్తాయని ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ శిరీష అన్నారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాల రక్షాభవన్‌లో పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దత్తత తీసుకున్న వారు పిల్లలను ప్రేమ, వాత్సల్యంతో పెంచాలన్నారు. పిల్లలు లేని దంపతులు జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను సంప్రందించాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, బాలల సంరక్షణ అధికారులు నరేష్, వీరన్న, కౌన్సిలర్ రమేశ్, కమిటీ సభ్యుడు డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రెంటిస్‌షిప్ మేళా

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు ఈ నెల 11న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉదయం 11గంటలకు జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. బాబు శుక్రవారం తెలిపారు. అర్హులు ఆన్‌లైన్‌లో మహబూబాబాద్ అప్రెంటిస్‌షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని, సంబంధిత ధ్రువపత్రాలు ఐటీఐ కళాశాలలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా కేంద్రం ఇల్లెందు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

కేంద్ర బృందం సందర్శన



పెద్దవంగర: మండలంలోని వడ్డెకొత్తపల్లి పల్లె దవాఖానను ఎన్‌హెచ్ఎస్ఆర్సీ బృందం శుక్రవారం సందర్శించింది. దేశ వ్యాప్తంగా జాతీయ గ్రేడింగ్ పరిశీలనకు దవాఖాన ఎంపిక కాగా.. అందుతున్న 12 రకాల వైద్య సేవలపై కేంద్ర బృంద సభ్యులు రమణీ, గంగాధరన్ సమీక్షించారు. గర్భిణులు, బాలింతల సంరక్షణ, కౌమర బాలికలకు అందించే సేవలు, సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల నివారణ, ప్రాథమిక వైద్యం, కుటుంబ నియంత్రణ, శిశు సంరక్షణ వంటి సేవలు సంతృప్తి కరంగా ఉన్నట్లు పరిశీనలలో తేలింది. మరో ఐదు రకాల సేవలు పాక్షికంగా అందిస్తున్నట్లు గుర్తించారు. అలాగే ఆయుష్మాన్ భారత్ పథకం ద్వారా లభిస్తున్న ప్రయోజనాలు, మాతా–శిశు మరణాల నియంత్రణ, చర్యలు వంటి అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్ర బృంద సభ్యులు మాట్లాడుతూ.. రోగులకు అందుతున్న సేవలు, గుర్తించిన లోపాలు, మెరుగైన వైద్య సౌకర్యాల కోసం తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదికను జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులకు అందిస్తామని వెల్లడించారు.

అను బంధం.. రాగం!

నేడు రక్షా బంధన్



- వృద్ధాప్యంలోనూ ప్రేమానుబంధాన్ని చాటుతున్న అక్కాచెల్లెళ్లు
- ఎక్కడున్నా.. రాఖీ పౌర్ణమికి సోదరుల ఎదురుచూపులు

అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య అనుబంధాన్ని పంచి పెంచే పండుగ రక్షాబంధన్. శ్రావణమాసంలో వచ్చే పౌర్ణమి రోజున కులమతాలకతీతంగా ఈ వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. రాఖీ అంటే దారం కాదు.. అది ఒక రక్షణ కవచం, బంధాలను గుర్తుచేసే సందర్భం. సోదరుడి మణికట్టుకు సోదరి కట్టే రాఖీ అనురాగాలు, ఆప్యాయతకు ప్రతీకగా నిలుస్తోంది. వృద్ధాప్యం మీద పడినా.. ఏ పరిస్థితుల్లో ఉన్నా తన తమ్ముడికి, అన్నకు రాఖీ కట్టే అక్కలు, చెల్లెళ్లు ఎందరో ఉన్నారు. ప్రేమను పంచుతున్న అలాంటివారిపై నేడు రాఖీ పౌర్ణమి (రక్షా బంధన్) సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

45 ఏళ్లుగా రాఖీ కడుతున్న చెల్లెలు

బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన కొత్తపల్లి రాజయ్య, కాశీపతి, మురళి, ఊర్మిల అన్నాచెల్లెలు. ముగ్గురు అన్నలకు చిన్నారి చెల్లె ఊర్మిల. ఈమె వివాహం 1980లో జగదేవపూర్‌కు చెందిన వ్యక్తితో జరిపించారు. వారు అప్పటి నుంచి వ్యాపార నిమిత్తం సిద్దిపేటలో ఉంటున్నారు. 45 సంవత్సరాలుగా ఊర్మిల బచ్చన్నపేటకు వచ్చి అన్నలు కొత్తపల్లి రాజయ్య, కాశీపతి, మురళికి తప్పకుండా రాఖీ కడుతుంది. అన్నలు ఇచ్చే కట్న కానుకలను సంతోషంగా స్వీకరిస్తుంది. ప్రతి సంవత్సరం ముగ్గురు అన్నలు చెల్లె ఊర్మిల వచ్చే వరకు ఎదురు చూస్తుంటారు.



అక్కలంటే అమిత ప్రేమ..



జనగామ: జనగామలోని వీవర్స్ కాలనీకి చెందిన కాముని ఉపేంద్ర, వైట్ల కళమ్మ, చింతకింది సక్కుబాయి, చెన్నూరి రేణుక అక్కాచెల్లెళ్లు. వారి సోదరుడు గజ్జెల వెంకటేశ్‌కు ఆరు దశాబ్దాలుగా రాఖీ కడుతూ రాఖీ బంధాన్ని గుర్తు చేస్తున్నారు. మూడు రోజుల ముందుగానే రాఖీలు కొని, ఒక్కరోజు ముందుగా వెళ్తారు. తమ్ముడికి రాఖీ కడతారు.

బంధాలకు విలువనివ్వాలి..



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణానికి చెందిన 82 ఏళ్ల వయసుగల తాటిపాముల నరసింహమూర్తికి 65 ఏళ్ల చెల్లెలు గుడి విజయలక్ష్మి ప్రతి ఏడాది రాఖీ కడుతుంది. ఆత్మీయత, అనురాగాలకు ప్రతీకగా రాఖీ పండుగ ఉంటుందని అన్నాచెల్లెళ్లు పేర్కొంటున్నారు. ప్రతిఒక్కరూ బంధాలు, బంధుత్వాలకు విలువ ఇవ్వాలని వారు కోరారు. రాఖీ పండుగ వచ్చిందంటే చాలు అన్నాచెల్లెళ్ల మధ్య ఉండే ఆ సంతోషం ఎన్నటికీ మరిచిపోలేనిదని వారు తెలిపారు.

అన్న జ్ఞాపకంగా..



నల్లబెల్లి: నాకు ఇప్పుడు 72 ఏళ్లు. నా చిన్నతనం నుంచి అన్న, తమ్ముడికి రాకిట్లు కట్టేదాన్ని. అన్న మల్లయ్య 28 ఏళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయిండు. ఇప్పుడు తమ్ముడు కృష్ణయ్యతో పాటు అన్న కొడుకు శ్రీనివాస్‌కు రాఖీ కడతన్న. ఈ పండుగ ఎంతో సంబరంగా అనిపిస్తుంది. తోడబుట్టినోళ్లం ఒకదగ్గర కలుసుకుని సంతోషంగా గడుపుతాం. ఎక్కడున్నా రాఖీ కట్టడానికి పుట్టింటికి వెళ్త.

– నాగపురి లక్ష్మి, నల్లబెల్లి

కష్టసుఖాల్లో పాలుపంచుకుంటాం..



వెంకటాపురం(ఎం): మేం నలుగురం అక్కాచెల్లెళ్లం. రాఖీ పండుగ వచ్చిందంటే చాలు ప్రతి ఏటా హనుమకొండకు వెళ్లి తమ్ముడు రాజమౌళికి రాఖీ కడతాం. ఇప్పటికీ మా బంధం ఇలానే కొనసాగుతోంది. కష్టసుఖాల్లో మేం పాలుపంచుకుంటాం.

– పల్నాటి నిర్మల, వెంకటాపురం (ఎం)

వీరు కూడా ఆచారం పాటిస్తున్నారు..



హసన్‌పర్తి: ఇక్కడ ముస్లింలు కూడా రాఖీ వేడుకలను నిర్వహిస్తున్నారు. 30 ఏళ్లుగా ఓ ముస్లిం కుటుంబంలో ఈ ఆచారం కొనసాగుతోంది. హసన్‌పర్తికి చెందిన మహ్మద్ ఖాజానయీమొద్దీన్ సోదరి అమీనాషాహిన్ స్వస్థలం హనుమకొండ. రాఖీ పండుగను పురస్కరించుకుని ఏటా ఆమె ఎక్కడున్నా హసన్‌పర్తికి వచ్చి అన్నకు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుంటుంది. రాఖీ తోబుట్టువుల బంధాన్ని బలోపేతం చేస్తుందని అమీనాషాహిన్ అంటున్నారు.

నాలుగున్నర దశాబ్దాలుగా క్రమం తప్పకుండా..



రేగొండ: 45 ఏళ్లుగా ఓ అక్క తన తమ్ముడికి క్రమం తప్పకుండా రాఖీ కడుతూనే ఉంది. కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన వన్నాల లింగయ్య, రాంబాయి అక్కాతమ్ముళ్లు. రాంబాయిని అదే మండలంలోని కోనరావుపేట గ్రామానికి ఇచ్చి వివాహం చేశారు. రాంబాయి ప్రతీ ఏటా రాఖీ కడుతూ అక్కాతమ్ముళ్ల బంధాన్ని చాటుకుంటోంది. ఏ పరిస్థితుల్లో ఉన్నా తమ్ముడికి రాఖీ కట్టడం ఎంతో సంతోషాన్నిస్తుందని రాంబాయి తెలుపుతోంది.

పోలీసుల విస్తృత తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్ : మానుకోట పట్టణంలో రక్షాబంధన్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శుక్రవారం డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని రైల్వే స్టేషన్, పలు సెంటర్లలో టౌన్ పోలీసులు, జిల్లా బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీ లు నిర్వహించారు. టౌన్ ఇన్‌చార్జ్ సీఐ సర్వయ్య, ఎస్సైలు ప్రశాంత్, శివ, అశోక్, మౌనిక, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది అంజయ్య, అశోక్, డాగ్ హ్యాండ్లర్ యాకయ్య ఉన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

కేసముద్రం: అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు ఉంటాయని మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున మున్సిపాలిటీ పరిధిలోనిగిర్నితండాలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎలాంటి ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 40 ద్విచక్రవాహనాలు, 2 క్వింటాళ్ల నల్లబెల్లం, 50 లీటర్ల గుడుంబా, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సైలు మురళీధర్‌రాజు, నరేష్ ఉన్నారు.

సైబర్ మోసం

- రూ.లక్ష పోగొట్టుకున్న డోర్నకల్ వాసి

డోర్నకల్: సైబర్ మోసగాళ్ల వలలో పడి డోర్నకల్‌కు చెందిన ఓ వ్యక్తి రూ.లక్ష మోసపోయాడు. డోర్నకల్ సీఐ బి.రాజేశ్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ రాష్ట్ర పోలీస్‌శాఖలో ఐజీగా విధులు నిర్వహిస్తున్న డోర్నకల్ మండలం చాప్లాతండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్ పేరిట ఫేస్‌బుక్‌లో ఫర్నీచర్ అమ్ముతున్నట్లు ఈనెల 1న ఐడీ కనిపించడంతో డోర్నకల్‌కు చెందిన పాట్ని ఆర్యన్ జైన్ అదే రోజు రూ.70వేలను సంబంధిత ఐడీ అకౌంట్‌కు బదిలీ చేశాడు. కొద్దిసేపటి తర్వాత మరికొంత డబ్బు పంపాలని సమాచారం రావడంతో మరోసారి రూ.30 వేలు పంపాడు. కొద్దిరోజుల వరకు ఎలాంటి సమాచారం రాకపోవడంతో తాను మోసపోయినట్లు గుర్తించిన ఆర్యన్‌జైన్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. స్పందించిన పోలీసులు వెంటనే నిందితుడి అకౌంట్‌ను గుర్తించి అందులోని రూ.28 వేలను హోల్డ్‌లో ఉంచారు. కేసు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దు

- ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

గంగారం: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించొద్దని, రైతులకు అవసరమైన ఎరువుల నిల్వలు ఉన్నాయని ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో సీజన్‌కు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కేజీబీవీ పాఠశాలను సందర్శించి విద్యార్థినుల చదువు సామర్థ్యాలను పరిశీలించారు. డిజిటల్ విధానంలో విద్యాబోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు చేపించాలన్నారు. ప్రత్యేకాధికారులు వసతి గృహాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. కాగా, గంగారం గ్రామానికి చెందిన 350మంది రైతుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని ఇన్‌చార్జ్ కలెక్టర్‌ను మాజీ ఎంపీటీసీ బూర్క వెంకటయ్య కోరారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అజ్మీరా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



గంగారం: విద్యార్థినుల చదువు సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

ప్లాస్టిక్ నియంత్రణకు కృషి చేయాలి

మహబూబాబాద్: ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మానుకోట మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులు, కూరగాయాల మార్కెట్, జంక్షన్లలో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల నివారణకు కృషి చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. పెండింగ్ పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. కమిషనర్ రాజేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'ని వేగవంతం చేయాలి

- అడిషనల్ కలెక్టర్ అనిల్‌కుమార్

కురవి: భూ భారతి దరఖాస్తులను వేగవంతంగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. భూ భారతి దరఖాస్తులను పరిశీలించారు. కార్యాలయానికి వచ్చి రైతుల సమస్యలను విని పరిష్కరించాలని సూచించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లను సత్వరమే అందించాలన్నారు. కార్యక్రమంలో డీటీ గణేశ్, ఆర్ఐ రవికుమార్ పాల్గొన్నారు. కాగా, మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్సీ బాలికల వసతి గృహంలోని సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు, కొలిపాక వీరేందర్, జశ్వంత్, యాకన్న, తరుణ్, విగ్నేష్ పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలిస్తున్న అడిషనల్ కలెక్టర్

సీడబ్ల్యూసీ నియామకానికి మోక్షం

ముగిసిన దరఖాస్తుల గడువు

- నోటిఫికేషన్ విడుదలలో గోప్యం
- దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులు

మహబూబాబాద్: బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) నియామకానికి ఎట్టకేలకు నోటిఫికేషన్ విడుదల చేశారు. కమిటీ కాలపరిమితి ముగిసిన 17 నెలల తర్వాత నూతన కమిటీ కోసం నోటిఫికేషన్ వేశారు. అయితే కనీసం ప్రకటన కూడా విడుదల చేయకపోవడంతో చాలా మంది అర్హులు సమాచారం లేక దరఖాస్తు చేసుకోలేదు.

బాలరక్షా భవన్‌లోనే..

జిల్లా కేంద్రంలోని బాలరక్షా భవన్‌లోనే జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, బాలల న్యాయ మండలి, చైల్డ్‌లైన్ 1098, డిస్ట్రిక్ట్ ప్రొబేషన్ ఆఫీసర్, చైల్డ్ లెవల్ ప్రాజెక్ట్ ఆఫీసర్, పిల్లల పోలీస్ యూనిట్ విభాగాలు కొనసాగుతున్నాయి. ఆ కార్యాలయంలో సుమారు 35 మంది పని చేస్తుండగా ప్రత్యేక వాహనం కూడా కేటాయించారు. సీడబ్ల్యూసీ కమిటీని 2021 ఫిబ్రవరిలో ఏర్పాటు చేశారు. కమిటీలో చైర్మన్‌తో పాటు నలుగురు సభ్యులు ఉంటారు. పదవీకాలం మూడేళ్లు కాగా.. 2024 ఫిబ్రవరిలో పదవీకాలం ముగిసింది. అప్పటి నుంచి నోటిఫికేషన్ విడుదల కాలేదు. దీంతో ఆ కమిటీనే కొనసాగుతోంది.

15 రోజుల క్రితం నోటిఫికేషన్..

నూతన కమిటీ నియామకం కోసం మహిళా, శిశు సంక్షేమశాఖ కమిషనర్ 15 రోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఆన్‌లైన్‌లో డబ్ల్యూసీడీ (ఉమెన్ చైల్డ్ డిపార్ట్‌మెంట్) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ నోటిఫికేషన్‌లో ఉంది.

అర్హతలివే..

పీజీలో ఎంఎస్‌డబ్ల్యూ (మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, సోషియాలజీ) కోర్సు పూర్తి చేసి ఉండాలి. 35 నుంచి 65 సంవత్సరాల మధ్య వయసు వారు అర్హులు. ఏడు సంవత్సరాల పాటు పిల్లల కోసం పని చేసిన అనుభవం, ఆ సంస్థ (ఎన్జీఓ) నుంచి జారీ చేసిన సర్టిఫికెట్ ఉండాలి. ముందుగా దరఖాస్తుదారులు కమిటీ చైర్మన్, సభ్యుల పదవుల కోసం దరఖాస్తు చేసుకుంటారు. అనంతరం ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే ఇంటర్వ్యూ నిర్వహించి ఎంపిక చేస్తారని అధికారులు పేర్కొన్నారు. పరీక్షలో వచ్చిన మార్కులు, ఇంటర్వ్యూలో వచ్చిన మార్కుల ఆధారంగా చైర్మన్‌తో పాటు సభ్యులను నియమిస్తారు.



జిల్లా కేంద్రంలోని బాల రక్షాభవన్ కార్యాలయం

కమిటీకి గౌరవ వేతనం..

కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులకు సమానమైన గౌరవ వేతనం ఉంటుంది. కానీ ప్రొటోకాల్ ప్రకారం చైర్మన్‌కు ప్రాధాన్యత ఉంటుంది. జీరో నుంచి 18సంవత్సరాలలోపు బాలబాలికల సమస్యలన్నీ వారి పరిధిలోకే వస్తాయి. బాల్య వివాహాలు, బాల కార్మికులు, పిల్లల అక్రమ రవాణా, అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటారు. పిల్లల దత్తత, తదితర అంశాలు సీడబ్ల్యూసీ పరిధిలోకి వస్తాయి. కార్యాలయంలో సీడబ్ల్యూసీ కోర్టు నిర్వహిస్తారు. నెలలో 20సార్లు ఆ కోర్టులో కేసుల విచారణ నిర్వహిస్తారు. ఒక్కసారి నిర్వహిస్తే ఐదుగురు కమిటీ సభ్యులకు గానూ ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున వస్తాయి. ఇలా వారికి నెలకు రూ.40,000వరకు వస్తాయి. హాజరు కాకపోతే వేతనం తగ్గుతుంది.

నోటిఫికేషన్‌పై గోప్యం..

మహిళా,శిశు సంక్షేమశాఖ కమిషనర్ నుంచి ఎలాంటి సమాచారం వచ్చిన జిల్లాలో ప్రకటన రూపంలో తెలియజేస్తారు. కానీ సీడబ్ల్యూసీ, బాలల న్యాయ మండలి సభ్యుల నియామక నోటిఫికేషన్ విషయంలో జిల్లాలోని డీడబ్ల్యూఓ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేయలేదు. దీంతో అర్హత ఉన్న వారు సమాచారం లేకపోవడంతో దరఖాస్తు చేసుకోలేదు.

బాలల న్యాయ మండలిలో సభ్యుల నియామకం కోసం కూడా..

అలాగే బాలల న్యాయమండలి సభ్యుల నియామకం కోసం కూడా నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆ విభాగం పరిధిలోకి జీరో నుంచి 18 సంవత్సరాలలోపు బాలబాలికలు వస్తారు. చట్టంతో విబేధించిన పిల్లలు, దొంగతనాలు, హత్యలు చేసిన వారు ఆ విభాగంలోకి వస్తారని అధికారులు పేర్కొన్నారు. ఆ విభాగంలో ఇద్దరు సభ్యుల ఉంటారు. వారి పదవీకాలం పూర్తి కావడంతో నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా ఆ దరఖాస్తుల గడువు కూడా ఈనెల 8తో ముగిసింది. దీనికి కూడా ఎంఎస్‌డబ్ల్యూ కోర్సు పూర్తి చేసి ఏడు సంవత్సరాల పాటు పిల్లల కోసం పనిచేసిన అనుభవం ఉండాలి. వారంలో ఒక్కరోజు కార్యాలయంలో కోర్టు మాదిరిగా నిర్వహిస్తారు. జడ్జి వచ్చి పరిష్కరిస్తారు. సభ్యులకు ఒక్కొక్కరికి నెలకు రూ.8,000 వేతనం ఉంటుంది. వారు వారంలో ఒక్కరోజు మాత్రమే వస్తారు.

ఆ పార్టీలను వెలివేద్దాం

- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వైఖరిని ప్రజల్లో ఎండగడుతాం
- 2028లో వచ్చేది బీసీ ప్రభుత్వమే
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

హన్మకొండ: బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ వైఖరిని ప్రజల్లో ఎండగడుతామని, ఆ మూడు పార్టీలను బీసీలు వెలివేయాలని ఎమ్మెల్సీ, బీసీ పొలిటికల్ జేఏసీ కన్వీనర్ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోందని, తాను నాలుగు నెలల క్రితమే చెప్పానన్నారు. ఢిల్లీకి వెళ్లి రిజర్వేషన్లు సాధిస్తామని చెప్పి, ఇప్పుడు తాము రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ అడిగితే ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా అడ్డుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరమన్నారు. తమ వల్ల కాదని కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి చెప్పకనే చెప్పున్నారని విమర్శించారు. అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పుతున్నట్లు జనాభా ఎంతో అంతే అవకాశాలు కల్పించాలన్న దానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందా అని ప్రశ్నించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బీసీలపై తన స్టాండ్ ఏమిటో చెప్పాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు, చట్టసభల్లోని బీసీ జేఏసీ పోటీ చేస్తుందన్నారు. 2028లో ఏర్పడేది బీసీ ప్రభుత్వమేనన్నారు. సమావేశంలో ఎం.జానయ్య, రజనీకుమార్, సూదగాని హరిశంకర్, నవీన్, నర్సింహగౌడ్, ప్రవీణ్, రవి పటేల్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఖోఖో మాజీ క్రీడాకారుడు సారంగపాణి మృతి



సారంగపాణి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జంగా రాఘవరెడ్డి

ఖిలా వరంగల్: ఖిలావరంగల్ మధ్యకోటకు చెందిన అంతర్జాతీయ ఖోఖో మాజీ క్రీడాకారుడు నాగవెల్లి సారంగపాణి(48) శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. వరంగల్ ఉమ్మడి జిల్లానుంచి అంతర్జాతీయస్థాయి వరకు ఎదిగిన సారంగపాణి.. పలువురు క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన చేతిలో ఎంతో మంది క్రీడాకారులు శిక్షణ పొంది అంతర్జాతీయస్థాయికి ఎదిగారు. ఆయనకు భార్య, ఒక దత్తపుత్రిక ఉంది. విషయం తెలిసి తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్, ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్, తెలంగాణ ఖోఖో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి.. సారంగపాణి పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఖోఖో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాం ప్రసాద్, కైలాస్ యాదవ్, తదితర క్రీడాకారులు ఉన్నారు.

ఓం వరలక్ష్మీ దేవాతాయనమః

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం



వేయిస్తంభాల ఆలయంలో వరాల రుద్రుని అలంకరణలో శ్రీరుద్రేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు



భద్రకాళి ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తుల బారులు

శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలు శ్రీవరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వ్రతం అనంతరం లక్ష్మీదేవికి చీరరవికలు, నైవేద్యాలు సమర్పించారు. ఒకరికొకరు నైవేద్య ప్రసాదాలు, వాయినాలు అందించుకున్నారు. పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. నగరంలోని వేయిస్తంభాల దేవాలయం, శ్రీభద్రకాళి దేవాలయం, ఎంజీఎం సమీపంలోని రాజరాజేశ్వరస్వామి వారి దేవాలయం, హంటర్‌రోడ్‌ని సంతోషిమాత దేవాలయం, శ్రీకాశీవిశేశ్వరస్వామి వారి దేవాలయం, పలు వేంకటేశ్వరస్వామి దేవాలయాలలోనూ వందలాది మంది భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

వరాల రుద్రునిగా శ్రీరుద్రేశ్వరస్వామి..

శ్రీరుద్రేశ్వరస్వామివారి వేయిస్తంభాల దేవాలయంలో శ్రావణమాసోత్సవాలలో భాగంగా శ్రీరుద్రేశ్వరస్వామి వారిని 11కిలోల పసుపు, 11కిలోల కుంకుమతో వరాల రుద్రునిగా అలంకరించి పూజలు, మహాహారతి జరిపి భక్తులకు సందర్శనం కల్పించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు గంగు మణికంఠశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ప్రణవ్, సందీప్‌శర్మ రుద్రాభిషేకం నిర్వహించారు.

భద్రకాళి దేవాలయంలో..

శ్రీభద్రకాళి దేవాలయంలో అమ్మవారికి శ్రావణమాసపూజలు నిర్వహించా రు. శుక్రవారం కావడంతో వేలాది మంది భక్తులు దేవాలయాన్ని సందర్శించారు. మహిళలు అమ్మవారిని దర్శించుకుని వాయినాలు ఇచ్చుకున్నారు. వ రంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి , మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

-హన్మకొండ కల్చరల్



హనుమకొండలో వరలక్ష్మీ వ్రతం ఆచరిస్తున్న మహిళలు

ఇరిగేషన్‌లో పదోన్నతులు

- ఉమ్మడి జిల్లాలోని ఐదు సర్కిళ్లకు కొత్త ఎస్ఈలు

హసన్‌పర్తి: నీటిపారుదలశాఖలో భారీగా పదోన్నతులు కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా 46 మంది ఈఈలకు ఎస్ఈలుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వరంగల్ ఎస్ఈగా విధులు నిర్వహించి పదోన్నతి పొందిన కె.వెంకటేశ్వర్లు స్థానంలో నిజామాబాద్ జిల్లా బోధన్, ఐడీ–1లో ఈఈగా విధులు నిర్వహిస్తున్న హెచ్.వి.రామప్రసాద్‌కు పదోన్నతి కల్పిస్తూ వరంగల్ ఎస్ఈగా నియమించారు. నర్సంపేటలో డిప్యూటీ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న వై.మోహన్‌రావుకు పదోన్నతి కల్పిస్తూ ములుగు ఎస్ఈగా బాధ్యతలు అప్పగించారు. రామగుండం ఐడీ–7లో ఈఈగా పనిచేస్తున్న జి.స్వామికి పదోన్నతి కల్పిస్తూ నర్సంపేట ఎస్ఈగా నియమించారు. మధిర ఐడీ–6 లో ఈఈగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.రామకృష్ణకు పదోన్నతి కల్పించారు. ఈమేరకు ఆయనకు మహబూబాబాద్ ఎస్ఈగా నియమించారు. కరీంనగర్ క్వాలిటీ కంట్రోల్ డివిజన్–7లో ఈఈగా పనిచేస్తున్న సీహెచ్.బుచ్చిరెడ్డికి పదోన్నతి కల్పిస్తూ క్వాలిటీ కంట్రోల్ వరంగల్ ఎస్ఈగా బాధ్యతలు అప్పగించారు. ఘనపురం ఆకులవారి ఐడీ–1లో ఈఈగా విధులు నిర్వహిస్తున్న వి.జగదీశ్‌కు పదోన్నతి కల్పిస్తూ పోచంపాడు ఎస్ఈగా నియమించారు. వరంగల్ ఐడీ–2 డివిజన్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న సీతారామ్‌కు పదోన్నతి కల్పిస్తూ చేవెళ్ల ఎస్ఈగా నియమించారు.

సొంతింటి కల నెరవేరుస్తాం

- రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు
- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- హనుమకొండలో డబుల్ బెడ్‌రూం, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



సభలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి





మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని, లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం పట్టాలు అందిస్తున్న మంత్రి పొంగులేటి

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో అర్హులైన ప్రతీ పేద కుటుంబ సొంతింటి కలను ప్రజాప్రభుత్వం నెరవేరుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని బాలసముద్రం అంబేద్కర్‌నగర్‌లో జీ ప్లస్ త్రీ విధానంలో నిర్మించిన 592 డబుల్ బెడ్‌రూం ఇళ్లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్యశారదతో కలిసి మంత్రి పొంగులేటి ప్రారంభించారు. అనంతరం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం ఆడిటోరియంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ..పేదల సొంతింటి కలను నెరవేర్చాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి, తన వద్దకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పలుమార్లు వచ్చారన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టి ఆరు సంవత్సరాలైన గత పాలకులు ఇవ్వలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రానున్న మూడేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన పాపానపోలేదన్నారు. ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 17 లక్షల మందిని పాత కార్డుల్లో కొత్తగా చేర్చామని, ఆరు లక్షల మందికి కొత్తగా రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత తమదేనన్నారు.

ఎమ్మెల్యేగా గెలిచిన దానికంటే సంతోషంగా ఉంది..: నాయిని

పండుగ వాతావరణంలో లబ్ధిదారులకు ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేసుకోవడం ఎమ్మెల్యేగా గెలిచిన దానికంటే సంతోషంగా ఉందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గుడిసెలు వేసుకున్న అందరికీ ఇళ్లు కేటాయించామని, ఇంకా ఎవరైనా ఉన్నట్లయితే వారికి తప్పనిసరిగా న్యూశాయంపేటలో కేటాయిస్తామన్నారు. ఇంకా చాలా మంది నిరుపేదలున్నారని, శాయంపేట, తదితర ప్రాంతంలో ప్రభుత్వ భూములు గుర్తించి అక్కడ కూడా ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేవిధంగా కేటాయించాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటిని కోరారు. 592మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించకుండా 2,500 మంది వద్ద అక్రమంగా ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఈ సందర్భంగా మహిళలు మంత్రి, ప్రజాప్రతినిధులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో తీవ్ర కష్టాలు అనుభవించిన రహీమున్నీసాకు తొలి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకటరావిరెడ్డి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, అధికారులు, ప్రజాప్రతినిధులు, ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

నిర్మాణసంస్థ నిర్లక్ష్యమే..

మల్లంపల్లి పాత బ్రిడ్జి కుంగుబాటుకు కారణం

- కొత్త బ్రిడ్జి నిర్మాణ పనుల్లో అలసత్వంతో ఘటన
- దారిమళ్లింపుతో వాహనదారుల ఇబ్బందులు



మట్టి కూలిపోవడంతో బ్రిడ్జి కింది భాగంలో ఏర్పడిన గోతి

ములుగు రూరల్: ములుగు జిల్లా నుంచి భూపాలపట్నం వెళ్లే 163 జాతీయ రహదారిపై మల్లంపల్లి వద్ద ఉన్న బ్రిడ్జి గురువారం రెయిలింగ్ పడిపోయి కుంగిన విషయం తెలిసిందే. జాతీయరహదారి విస్తరణ పనుల్లో భాగంగా మల్లంపల్లి కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులను దక్కించుకున్న సంస్థ అలసత్వం కారణంగానే బ్రిడ్జి కుంగిందని పలువురు నిపుణులు ఆరోపిస్తున్నారు. గతేడాది జూలై 17వ తేదీ వరకు పనులను పూర్తి చేయవలసిన వృద్ధి సంస్థ యాజమాన్యం పనులను జాప్యం చేయడమే దీనికి కారణమని తెలుస్తోంది. ప్రభుత్వం విధించిన సమయం పూర్తయిన కూడా..సదరు సంస్థ అధికారులను మచ్చిక చేసుకొని ఈఓటీ అనుమతులు లేకుండా 6 నెలల క్రితం పనులను ప్రారంభించింది. ఎస్సారెస్పీ కాలువపై ఉన్న గత బ్రిడ్జి నిర్మాణంలో కాలువ నీటి ప్రవాహం దృష్టిలో పెట్టుకొని పైపులు వేసి పై నుంచి మట్టిని నింపి బ్రిడ్జి నిర్మాణం చేపట్టింది. నిర్మాణ సంస్థ పనులు చేపడుతున్న సమయంలో నిర్లక్ష్యం కారణంగా పాత బ్రిడ్జి రెయిలింగ్ పడిపోవడంతో పాటు మట్టి పోయి కుంగిపోయింది. దీంతో రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

దారి మళ్లింపు దూరభారం

జాతీయ రహదారిపై బ్రిడ్జి కుంగిపోవడంతో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వాహనాలను దారిమళ్లించారు. హనుమకొండ నుంచి ములుగు, ఏటూరు నాగారం వెళ్లే వాహనదారులకు రవాణా అంతరాయం ఏర్పడింది. హనుమకొండ నుంచి ములుగు వైపు వస్తున్న భారీ వాహనాలను గుడెప్పాడ్-పరకాల-రేగొండ-జంగాలపల్లి మార్గంలో దారిమళ్లించడంతో వాహనదారులకు సుమారు 25 నుంచి 30 కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. హనుమకొండ, నర్సంపేట నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను, కారులను శ్రీనగర్–రాంచంద్రాపూర్–పందికుంట మీదుగా దారిమళ్లించడంతో సుమారు 15 కిలోమీటర్ల దూరం పెరుగుతుంది. బ్రిడ్జి కుంగిపోవడంతో మల్లంపల్లి వద్ద బ్రిడ్జికి ఇరుపక్కల పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. బారికేడ్లు, చెక్‌పోస్ట్‌లను ఏర్పాటు చేశారు.

నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

మల్లంపల్లి వద్ద కుంగిన బ్రిడ్జిని ఎన్‌హెచ్ అధికారులు పర్యవేక్షించారు. భారీ యంత్రాలలో బ్రిడ్జి నిర్మాణ పనులు చేపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణంలో వాడిన రివిటింగ్ కదిలిపోవడంతో సంఘటన చోటుచేసుకుందని అధికారులు భావిస్తున్నారు. నూతన బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం.

బస్సులు దారిమళ్లింపు

హన్మకొండ: హనుమకొండ–ములుగు రూట్ మల్లంపల్లి వద్ద బ్రిడ్జి కూలడంతో ఆర్టీసీ బస్సులను దారిమళ్లిస్తున్నారు. ప్రయాణికులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు ములుగు, ఏటూరునాగారం రూట్‌లో దారి మళ్లించి బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు మల్లంపల్లి, శ్రీనగర్, పందికుంట ద్వారా ములుగుకు చేరుకుంటాయి. తిరుగు ప్రయాణంలోనూ ఇదే రూట్‌లో వెళ్తాయి. సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎలక్ట్రిక్ బస్సులు హనుమకొండ, పరకాల, రేగొండ, సుల్తాన్‌పూర్, అబ్బాపూర్, గోరికొత్తపల్లి మీదుగా జాకారం ద్వారా ములుగు, ఏటూరు నాగారం నడుస్తున్నాయి. తిరుగు ప్రయాణంలోనూ ఇదే రూట్‌లో వెళ్తాయి. మల్లంపల్లి వద్ద ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జరిగే వరకు ఈ రూట్లలో బస్సులు నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

వాహనదారులు సహకరించాలి



తాత్కాలిక వంతెన నిర్మాణం పూర్తయ్యే వరకు వాహనదారులు ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులకు సహకరించాలి. వాహన రాకపోకలకు డైవర్షన్ మార్గాలను అనుసరించాలి. ఆర్టీసీ ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ మార్గంలో భారీ వాహనాలను అనుమతించడం లేదు గమనించాలి.

-ములుగు ఎస్పీ శబరీష్

రైల్వే క్యాంపింగ్ బోగి దగ్ధం



కేసముద్రం రైల్వేస్టేషన్‌లో దగ్ధమవుతున్న క్యాంపింగ్ బోగీ



దగ్ధమైన తర్వాత బోగీ

- అర్ధరాత్రి సమయంలో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఘటన
- నలుగురు సిబ్బందికి తప్పిన ప్రమాదం
- షార్ట్‌సర్క్యూట్ కారణమని అంచనా..?

కేసముద్రం: ప్రమాదవశాత్తు రైల్వే క్యాంపింగ్ కోచ్(బోగి) దగ్ధమైన సంఘటన కేసముద్రం రైల్వేస్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి దాటాక చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. కొత్తగా చేపడుతున్న రైల్వే థర్డ్‌లైన్ పనుల్లో భాగంగా కేసముద్రం రైల్వేస్టేషన్‌లోని థర్డ్‌లైన్ పక్కనున్న లూప్‌లైన్‌పై రైల్వే క్యాంపింగ్ కోచ్‌ను నిలిపారు. థర్డ్‌లైన్ పనుల అనంతరం నలుగురు సిబ్బంది (ఇద్దరు టెక్నిషియన్స్, ఇద్దరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది) ఆ క్యాంపింగ్ కోచ్‌లో నిద్రించేందుకు ఎక్కారు. ఈ క్రమంలో బోగిలో పొగలు వస్తుండటంతో గమనించిన నలుగురు అప్రమత్తమయ్యారు. మంటలు వ్యాపిస్తుండటంతో చల్లార్పే ప్రయత్నం చేసిన తగ్గకపోవడంతో బయటకు పరుగులు తీశారు. అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత సంఘటన స్థలానికి మానుకోట, డోర్నకల్ నుంచి రెండు ఫైరింజన్‌లు చేరుకుని మంటలు ఆర్పివేశాయి. బోగిలో ఉన్న సిబ్బందికి సంబంధించిన దుస్తులు, ఇతర సామగ్రితోపాటు, సీట్లు, ఏసీ, ఫ్యాన్‌లు దగ్ధం కాగా, 8 ఆయిల్ డ్రమ్ములు సురక్షితంగా ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే బోగి దగ్ధమైనట్లుగా రైల్వే అధికారులు అంచనా వేస్తున్నట్లు తెలుస్తోంది. క్యాంపింగ్ బోగి దగ్ధంతో రూ.కోటికి పైగా నష్టం వాటిల్లినట్లు సమాచారం. శుక్రవారం సంఘటనా స్థలాన్ని ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీరింగ్(పీసీఈ) ఆంజనేయులురెడ్డి, పీసీఎంఈ ధర్మేందర్‌కుమార్, సీనియర్ ఎస్పీ సికింద్రాబాద్ కె.నవీన్‌కుమార్, ఏడీఆర్ఎం గోపాలక్రిష్ణతోపాటు పలువురు అధికారులు సందర్శించారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయంపై విచారణ చేపట్టారు. ఘటనపై త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి విచారించనున్నారు.

కాజీపేట మీదుగా వెళ్లే 16 రైళ్లు పొడిగింపు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్లు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రీడెవలప్‌మెంట్‌తో మేజర్ అప్‌గ్రేడేషన్ వర్క్స్‌తో ఆగస్టు 6వ తేదీ నుంచి అక్టోబర్ 19 వరకు సికింద్రాబాద్ నుంచి ప్రారంభమయ్యే పలు రైళ్లు కాచిగూడ, మల్కాజ్‌గిరి వరకు పొడిగించి నడిపిస్తున్నట్లు శుక్రవారం రాత్రి రైల్వే అధికారులు తెలిపారు.

పొడిగింపు రైళ్ల వివరాలు..

విజయవాడ–సికింద్రాబాద్ (12713) వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను కాచిగూడ నుంచి సికింద్రాబాద్–విజయవాడ (12714) వెళ్లే శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను కాచిగూడ నుంచి సికింద్రాబాద్–పోరుబందర్ (20967) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను, ఉమ్‌దానగర్ నుంచి పోరుబందర్–సికింద్రాబాద్ (20968) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను, ఉమ్‌దానగర్ నుంచి సికింద్రాబాద్–మణుగూరు (12745) వెళ్లే డైలీఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, మణుగూరు–సికింద్రాబాద్ (12746) వెళ్లే డైలీ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, సికింద్రాబాద్–దర్భాంగా (17007) వెళ్లే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, దర్భాంగా–సికింద్రాబాద్ (17008) వెళ్లే బైవీక్లి ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, ముజఫరుద్దీన్–సికింద్రాబాద్ (05293) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, సికింద్రాబాద్ –ముజఫరుద్దీన్ (05294) వెళ్లే వీక్లి ఎక్స్‌ప్రెస్ చర్లపల్లి నుంచి, సికింద్రాబాద్–సంత్రగచ్చి (07221) వెళ్లే బై వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, సంత్రగచ్చి–సికింద్రాబాద్ (07222) వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, సికింద్రాబాద్–దానాపూర్ (07647) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, దానాపూర్–సికింద్రాబాద్ (07648) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, హైదరాబాద్–రక్సోల్ (07051) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి, రక్సోల్–చర్లపల్లి (07052) వెళ్లే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను చర్లపల్లి నుంచి నడిపిస్తున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు.

కొత్తగూడ ఏజెన్సీలో పులి సంచారం?

- రాంపూర్ అడవుల్లో దుక్కిటెద్దును చంపినట్టు నిర్ధారణ



దుక్కిటెద్దు కళేబరాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఏజెన్సీలో పులి సంచారం మళ్లీ కలకలం రేపుతోంది. మండలంలోని రాంపూర్ అటవీ ప్రాంతంలో దుక్కిటెద్దును చంపి తిన్నట్లు ఆలస్యంగా గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన పుల్సం పెద్ద సాంబయ్యకు చెందిన దుక్కిటెద్దు వారం రోజుల క్రితం మేతకు వెళ్లి తిరిగి రాలేదు. ఎద్దు కోసం పరిసర గ్రామాల్లో, అడవిలో వెతుకుతుండగా దట్టమైన అటవీ ప్రాంతంలో ఎద్దు కళేబరం కనిపించింది. కళేబరంలో కొంత భాగం కొంత దూరంలో కనిపించడంతో అనుమానం వచ్చిన రైతు పెద్దసాంబయ్య అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన ఎఫ్ఆర్వో వజ్రహత్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ పులి అడుగులు కనిపించడంతో ఎద్దును పులి వేటాడినట్లు నిర్ధారించారు. రాంపూర్, సరసనపల్లి, పూనుగొండ్ల, కర్నెగండి, కోనాపురం గ్రామాల ప్రజలు పశువులను మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లవద్దని సూచనలు చేశారు. గత సంవత్సరం కోనాపూర్ అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న పొలాల్లో అధికారులు పులి పాద ముద్రలు గుర్తించారు. ఆ పులి పూనుగొండ్ల మీదుగా కిన్నెరసాని అటవీ ప్రాంతానికి వెళ్లిపోయినట్లు పాద ముద్రల ఆధారంగా అంచనాకు వచ్చారు. అయితే అది వెళ్లిందా లేక ఈ అటవీ ప్రాంతంలో ఆవాసం ఏర్పాటు చేసుకుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కేయూలో మెస్‌ల మూసివేత

- 18వరకు షార్ట్‌టర్మ్ సెలవులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పలు హాస్టళ్లు, కామన్‌మెస్, మహిళా హాస్టల్ మెస్‌లను శుక్రవారం ఉదయం విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పెట్టాక మూసివేశారు. దీంతో పీజీ కోర్సులు చేసే వివిధ హాస్టళ్ల విద్యార్థులు ఇంటిముఖం పట్టారు. ఈనెల 18వరకు షార్ట్ టర్మ్ సెలవులను ప్రకటించిన విషయం తెలిసిందే. హాస్టళ్లలో పలు మరమ్మతుల పనులు చేపట్టబోతున్నామని హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ తెలిపారు. పరీక్షలు రాస్తున్న బీఫార్మసీ విద్యార్థులకు మాత్రం హాస్టల్ వసతితోపాటుగా మెస్ సదుపాయం కల్పిస్తున్నారు. అలాగే లా కళాశాల విద్యార్థుల కోసం సుబేదారిలోని హాస్టల్‌లో మెస్ సదుపాయం కొనసాగుతుందని తెలిపారు. యూనివర్సిటీలోని పీజీ కోర్సుల విద్యార్థులు ఈ విద్యాసంవత్సరం 2025–2026కు అడ్మిషన్లను రెన్యూవల్ చేసుకోవాలని అలాగే హాస్టల్ వసతి కోసం రెన్యూవల్ చేసుకోవాలని హాస్టళ్ల డైరెక్టర్ రాజ్‌కుమార్ కోరారు. ఈనెల 15నుంచి ఆన్‌లైన్‌లోనే సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంచుతామన్నారు.